www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 72 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45



www.andhrajyothy.com

ANDHRAJYOTHI

సోమవారం | 10-6-2024 | పేజీలు: 10 +8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 72 | వరంగల్

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చవితి సా. 4.15 తదుపరి పంచమి; నక్షత్రం: పుష్యమి రా. 9.40 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: శే.ఉ.6.28; దుర్ముహూర్తం: మ.12.40-1.32, మ.3.16-4.09; అమృతఘడియలు: మ.2.54-4.36; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.45

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఉపాధ్యాయుడికి ఇస్రో ఆహ్వానం



పూస కిషోర్

నెక్కొండ, జూన్ 9 : వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న పూస కిషోర్‌కు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్(ఐఐఎస్ఆర్) సంస్థల నుంచి ఐదు రోజుల ఆన్‌లైన్ శిక్షణకు ఆహ్వానం వచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు రంగారావు ఆదివారం తెలిపారు. ఇస్రో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉత్సాహం ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ఇటీవల ప్రభుత్వంఆన్‌లైన్‌లో ఆహ్వానాలు కోరిందన్నారు. దీంతో కిషోర్ దరఖాస్తు చేసుకోగా శిక్షణకు ఇస్రో ఆహ్వానం పంపినట్లు వెల్లడించారు. హిందీ పండింట్ కిషోర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, స్కూల్ ఇన్నోవేటివ్ ఛాలెంజెస్ తదితర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 14 వరకు స్పేస్ టెక్నాలజీ అనువర్తనాలు అనే అంశంపై ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో కిషోర్ పాల్గొంటారన్నారు. ఈ మేరకు కిషోర్‌ను స్టేట్ కన్స్యూమర్స్ కౌన్సిల్ వైస్ చైర్మన్ బూరుగుపల్లి శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

దత్తత సులభతరం



- ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ
- నిబంధనలు సవరించిన కేంద్రం
- పిల్లలు లేని దంపతులకు వరం
- గ్రామాల్లో అధికారుల విస్తృత ప్రచారం

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : మాతృత్వం పొందలేని వారికి దత్తతను కేంద్ర ప్రభుత్వం సులభతరం చేసింది. సంతానం పొందలేని వారికి ఈ ప్రక్రియ ఓ వరంగా మారింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా ఇది జరుగుతోంది. దేశంలోనే అన్ని మతస్థులకు దత్తత ప్రక్రియ ఒకే విధంగా ఉంటుంది. దత్తత అంశం కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా జరుగుతుంది. ఛ్చిట్ప.రీచిచీ.జొరి.జీ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దత్తత నిబంధనలను 2017, జనవరి 26 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేసింది. ఈ నిబంధనలు దత్తతను మరింత సులభతరం చేసింది. రిజిస్ట్రేషన్ చేసుకున్న దంపతులకు చట్టబద్ధత ప్రకారం చిన్నారులను దత్తత ఇవ్వబడుతుంది. జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో తండాల్లో పిల్లలను విక్రయించడం చట్టరీత్యా నేరమని సంబంధిత అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కాగా, 2018 నాటి నుంచి నేటి వరకు మహబూబాబాద్ జిల్లాలో 17 మంది చిన్నారులను పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవడం జరిగింది.

దత్తతకు అర్హతలు ఇవే..

తల్లిదండ్రులు లేని బాలలను దత్తత తీసుకొనే దంపతులకు చట్టబద్ధతను కల్పించేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది. పిల్లలకు వారి నుంచి దక్కాల్సిన అన్ని హక్కులూ కల్పిస్తారు. దత్తత కోరే తల్లిదండ్రులు శారీరకంగా, మానసికంగా స్థిరంగా ఉండాలి. ఆర్థిక సామర్థ్యం కలిగి ఉండి ప్రాణాంతక వ్యాధులు ఉన్నవారు అనర్హులు. దత్తత కోరే తల్లిదండ్రులు వారి వైవాహిక స్థితితో పాటు వారికి జీవసంబంధమైన కుమారుడు, కుమార్తె ఉన్నారా.. లేదా అనే దానితో సంబంధం లేకుండా పిల్లవాడిని ఈ కింది వాటికి లోబడి దత్తత తీసుకోవచ్చు.

- దత్తత తీసుకోవడానికి భార్యభర్తల సమ్మతి అవసరం.
- ఒంటరి స్త్రీ ఏ లింగానికి(అమ్మాయి/అబ్బాయిని) చెందిన వారినైనా దత్తత తీసుకోవచ్చు.
- ఒక పురుషుడు ఆడపిల్లను దత్తత తీసుకొనుటకు అనర్హుడు.
- కనీసం రెండు సంవత్సరాల వైవాహిక జీవిత సంబంధం కలిగి ఉండకపోతే ఆ దంపతులకు దత్తత ఇవ్వబడదు.
- రిజిస్ట్రేషన్ తేదీ నాటికి దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రుల వయస్సును బట్టి వివిధ వయస్సు గల పిల్లలకు దరఖాస్తు చేసుకోవాలి.

వీరిని సంప్రదించాలి..

జిల్లాల్లో ఉన్న అన్ని మహిళా సంక్షేమ శాఖల్లోని జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా దత్తత ప్రక్రియ జరుగుతుంది. దీనికోసం ప్రత్యేకంగా ఐసీపీఎస్ నందు బాలల సంరక్షణ అధికారి, కౌన్సిలర్లు జిల్లాలో అందుబాటులో ఉంటారు. అలాగే అన్ని జిల్లాల్లోని శిశు గృహ స్పెషల్ అడాప్షన్ ఏజెన్సీ(ఎస్ఏఏ) ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. స్టేట్ అడాప్షన్ రిసోర్స్ ఏజెన్సీ(ఎస్ఏఆర్ఏ) దత్తతను దేశీయ దత్తత, బంధుత్వ దత్తత ప్రక్రియలను పర్యవేక్షిస్తూ వీరు అందుబాటులో ఉంటారు.

దరఖాస్తుకు కావల్సిన పత్రాలు

- దంపతుల ఫొటో, పాన్‌కార్డు
- నివాస ధృవీకరణ పత్రం(ఆధార్/ఓటరు కార్డు/పాస్‌పోర్టు/డ్రైవింగ్ లైసెన్స్)
- వివాహ ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం(వేతన స్లిప్)
- వయస్సు ధృవీకరణ పత్రాలు
- దంపతులిద్దరికి ఎటువంటి దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులు లేవని దత్తతకు అర్హులని డాక్టర్‌చే పొందిన ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్
- దరఖాస్తు చేసుకునే సమయంలో రూ.6వేలు పాప/బాబును తీసుకునేటప్పుడు రూ.50వేలు ప్రభుత్వానికి జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పేరు మీద డీడీ రూపంలో చెల్లించాలి.
- దత్తత ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇద్దరి ఐడీ, సెల్‌ఫోన్ నంబరు ద్వారా మెస్సెజ్ రూపంలో సమాచారం అందించబడుతుంది. 2022 దత్తత చట్ట సవరణల ప్రకారం.. జిల్లా మెజిస్ట్రేట్, కలెక్టర్ ద్వారా దత్తత చట్టబద్ధంగా జరుగుతుంది. ఈ దత్తత ప్రక్రియ మొత్తం సీఏఆర్ఏ అడాప్షన్ రెగ్యులేషన్ నియమ నిబంధనల ప్రకారం జరుగుతుంది.



మహబూబాబాద్‌లోని జిల్లా బాలల రక్షణ కార్యాలయంలో దత్తతపై అవగాహన కల్పిస్తున్న బాల సంరక్షణ అధికారి నరేష్ (ఫైల్)

అక్రమ దత్తత నేరం..

చట్ట వ్యతిరేకంగా పిల్లలను దత్తత ఇచ్చినా.. తీసుకున్న నేరం. జువైనల్ జస్టిస్ యాక్టు 2015 ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష, ఒక లక్ష రూపాయలు జరిమానా విధించబడుతుంది. ప్రసూతి వైద్యశాలలో పనిచేసే సిబ్బంది ఈ నేరానికి పాల్పడినట్లయితే 5 నుంచి 7 సంవత్సరాలు జైలుశిక్ష ఉంటుంది. చట్టబద్ధంగా కాకుండా అక్రమంగా దత్తత తీసుకుంటే పిల్లలకు చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు పొందలేరు. అక్రమ దత్తత తీసుకున్న తల్లిదండ్రులు ఎక్కువగా బ్లాక్‌మెయిల్‌కు గురవుతారు. పిల్లల హక్కులకు భంగం కలిగే అక్రమ దత్తతను గుర్తిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేయాలి. పిల్లలను పోషించే స్తోమత లేని తల్లిదండ్రులు వారిని జిల్లా సంక్షేమ శాఖకు అప్పగిస్తే చట్టబద్ధంగా దత్తత ఇవ్వబడును.

దత్తతపై విస్తృతంగా అవగాహన
వరలక్ష్మి, జిల్లా సంక్షేమాధికారి



జిల్లా వ్యాప్తంగా దత్తతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. సంతానం లేని వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు దత్తత ద్వారా పిల్లలను తీసుకునే వీలుకల్పిస్తున్నాం. మహిళా శిశు సంక్షేమశాఖ, ఆరోగ్యశాఖ సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. చట్టబద్ధమైన దత్తత ద్వారా మాత్రమే పిల్లల హక్కులు కాపాడుతాయి. అక్రమ దత్తత తీసుకున్న వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటాం.

అక్రమ దత్తత చట్టరీత్యా నేరం
నరేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి



అక్రమ దత్తత, పిల్లలను కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరం. అలా దత్తత తీసుకున్న వారిపై పోలీసుల సహకారంతో చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత తీసుకోవడం ద్వారానే దంపతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్సార్ ప్రభంజనం

- జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు కైవసం
- 22 మందికి వెయ్యిలోపు ర్యాంకులు



జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు సాధించిన జి.నవీన్

వివరాలు 2లో..

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీ కవిత



ఎర్రవల్లిలో కేసీఆర్‌తో మాజీ ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, జూన్ 9: మెదక్ జిల్లా ఎర్ర వల్లిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మానుకోట మాజీ ఎంపీ మాలోతు కవిత ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, ఫలితాలు, బీఆర్ఎస్ పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు హరిత పాల్గొన్నారు.

బిర్సాముండా ఆశయ సాధనకు పాటుపడాలి

- టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు చంద్రావతి



మహబూబాబాద్‌లో బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 9 : ఆదివాసీల పోరాట యోధుడు బిర్సాముండా ఆశయ సాధనకు అందరూ పాటుపడాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) మాజీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, తెలంగాణ హైకోర్టు న్యాయవాది జోగ్‌రాంనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బిర్సాముండా 124వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిర్సాముండా స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆదివాసీ వీరుడిగా, జానపద నాయకుడిగా ఆదివాసీ గిరిజనులను ఏకంచేసి ఆత్మ గౌరవ పోరాటం వైపు నడిపించిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బానోతు వీరునాయక్, మాలోతు శివ, గుగులోతు కిషన్‌నాయక్, చాగంటి ప్రభాకర్, బోడ రాంజీ, బానోత్ శ్రీనివాస్, మద్దెల వీరస్వామి, దాసరి మహేందర్, కదారి శ్రీనివాస్, వినోద్‌కుమార్, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

మానుకోటలో బీజేపీ సంబరాలు



మహబూబాబాద్ నెహ్రూసెంటర్‌లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : భారతీయ జనతా పార్టీ ఎన్డీఏ కూటమితో ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి మహబూభాబాద్ జిల్లా కేంద్రం నెహ్రూ సెంటర్‌లో బీజేపీ నేతలు బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య మాట్లాడుతూ... మోదీ ప్రధానిగా చేసిన పదేళ్లలో దేశ ఆర్థిక పరిస్థితులను, రక్షణ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లారని చెప్పారు. ప్రపంచ దేశాలు ఆకట్టుకునే విధంగా మోదీ పాలన కొనసాగించారన్నారు. ఇండియా కూటమి దేశ ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిందని తెలిపారు. ఎన్డీఏకు పూర్తి స్థాయి మెజారిటీ ఉందని, అందులో బీజేపీ స్వతహాగా 240 సీట్లు, దాని మిత్రపక్షమైన ఎన్డీఏను కలుపుకుని 293 సీట్లతో మూడోసారి మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం హర్షనీయమన్నారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణస్వీకారం చేయడం అభినందనీయమన్నారు. పట్టణాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీకి ప్రజలు 8 ఎమ్మెల్యే సీట్లు కట్టబెట్టగా, 17 ఎంపీ స్థానాల్లో 8 ఎంపీ సీట్లు గెలుచుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మోసంగి మురళి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, రాజుగౌడ్, పసుపులేటి నవీన్‌నాయుడు, ఇందుభారతి, నాగమణి, రాధాపటేల్, ఓర్సు పద్మావతి, పల్లె సందీప్, మల్లం యశ్వంత్, బాలునాయక్, శ్రీను, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమ్స్

- జిల్లాలో 3,377 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు
- కేంద్రాలను సందర్శించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 9 : జిల్లాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 7, తొర్రూరులో 5 కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 4,412 మంది అభ్యర్థులకు గాను 3,377 (76.54 శాతం) మంది హాజరు కాగా, 1,035 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన పరీక్షకు అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. అభ్యర్థులను పోలీసులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. కేంద్రాల్లోని ప్రతి గదిలో సీసీ కెమెరాల నిఘాలో అభ్యర్థులు పరీక్ష రాశారు. నిర్ణీత సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలనే నిబంధనతో అభ్యర్థులు ముందస్తుగానే చేరుకుని ప్రశాంతంగా పరీక్ష రాశారు. పోలీసు బందోబస్తు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతోపాటు అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

కేంద్రాలను సందర్శించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, ఏఎస్పీ జోగుల చెన్నయ్య వేర్వేరుగా సందర్శించారు. అభ్యర్థులకు కల్పించిన వసతులు, అభ్యర్థుల హాజరు, మెడికల్ క్యాంపులను పరిశీలించారు. మహర్షి విద్యాలయం, ఎస్వీ విద్యాలయం, నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలను డీఎస్పీ తిరుపతిరావు సందర్శించారు. డీఎస్పీ పర్యవేక్షణలో ప్రతి కేంద్రం వద్ద పరీక్ష ముగిసే వరకు సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బంది 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేశారు. కాగా, పరీక్ష కేంద్రాలను పరీక్షల కన్వీనర్ శ్రీనివాస్, అబ్జర్వర్లు బాలరాంనాయక్, చైతన్య సందర్శించారు.

ఆలస్యంతో తొమ్మిది మంది వెనక్కి.

జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు నిర్ణీత సమయం 10 గంటల కంటే ఆలస్యంగా వచ్చిన ఒక్కరిని కూడా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రం వద్ద ఒకరు, నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద నలుగురు, మహర్షి విద్యాలయ కేంద్రం వద్ద ఒకరు, ఏకశిల ఏంజిల్స్ కేంద్రం వద్ద ముగ్గురు మొత్తం 9 మంది అభ్యర్థులు నిర్ణీత సమయానికంటే ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించక పోవడంతో వెనుదిరిగి పోయారు.



మహబూబాబాద్‌లోని ఫాతిమా హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్





మహబూబాబాద్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రానికి పరిగెత్తుకుంటూ వస్తున్న అభ్యర్థులు

దొంగల బీభత్సం

- కౌసల్యదేవిపల్లిలో రెండిళ్లలో చోరీ
- రూ.3 లక్షల సొత్తు అపహరణ



దొంగతనం జరిగిన రవి ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న క్లూస్‌టీం

నర్సింహులపేట, జూన్ 9 : మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి పుస్తెలతాడు ఎత్తుకెళ్లగా, సమీపంలో ఉన్న మరో ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో దాచి ఉంచిన తులం బంగారం, వెండి పట్టీలు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రామంలో బైరోజు సుజాత అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు. శనివారం రాత్రి గ్రామంలో విద్యుత్ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలిపై దాడిచేసి మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును అపహరించుకెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన బత్తిని రవి ఈ నెల 7న కుటుంబ సమేతంగా నెల్లికుదురులోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేనిది గమనించి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారు ఆభరణాలు, రూ.15వేల నగదు అపహరించారు. వృద్ధురాలి తలకు బలమైన గాయం కావడంతో జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై జి.సతీష్ సిబ్బందితో చేరుకొని దర్యాప్తు జరుపుతున్నారు. క్లూస్ టీతో ఆధారాలు సేకరిస్తున్నామని, త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

గిరిజనుల రిజర్వేషన్లు తగ్గిస్తే ఉద్యమమే

గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు కిషన్ నాయక్



సమావేశంలో అభివాదం చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

నెహ్రూసెంటర్, జూన్ 9: గిరిజనులకు ఉన్న పది శాతం రిజర్వేషన్‌ను తగ్గిస్తే ఉద్యమం తప్పదని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు గుగులోతు కిషన్ నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం జీవో 33 ద్వారా ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్‌ను 10శాతం అమలు చేయాలన్నారు. గిరిజన సమాజం ఒక్క శాతం రిజర్వేషన్‌ను కూడా వదులుకునేందుకు సిద్ధంగా లేదని చెప్పారు. రిజర్వేషన్ తగ్గించి గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే చూస్తూ ఉరుకోబోమని, పాలకుల కుట్రలను తిప్పికొట్టాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బానోత్ రవికుమార్, గుగులోతు రవినాయక్, రాజునాయక్, రవీందర్, రాంజీనాయక్, రాంబాబు, చందులాల్, నారాయణ, ప్రభాకర్, కొండయ్య, సురేష్, శంకర్, శ్రీను, గణేష్, బానోత్ విజయ్, రాంచంద్రు, రాందాస్, గుగులోతు శివ వర్మ, రామన్న, చంద్రావతి పాల్గొన్నారు.



రాకేష్‌కుమార్ స్నేహిత్ సందేశ్ వెంకటేశ్వర్లు బోడ దినేష్ శ్రేతన్‌రెడ్డి వేదవచన్‌రెడ్డి రాంబాబు అరుణ్‌సింగ్ వినోద్

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎస్సార్ ప్రభంజనం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 9: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో జినవీన్ 8వ ర్యాంకు, పి.రాకేష్‌కుమార్ 36వ ర్యాంకు, కె.వినోద్ 39, జె.స్నేహిత్ సందేశ్ 123, వి.రాంబాబు 125వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు అన్ని కేటగిరీలు కలిపి జాతీయ స్థాయిలో వరుసగా వి. వేదవచన్‌రెడ్డి 127, జె.శ్రేతన్‌రెడ్డి 133, ఎస్.అరుణ్ సింగ్ 135, బోడ దినేష్ 157, ఎం.వెంకటేశ్వర్లు 185, దాసరి కార్తీక్ 299, తిలావత్ అఖిల్ నాయక్ 323, కె.శ్రీరామ్‌రెడ్డి 324తోపాటు 450, 598, 621, 654, 689, 737, 751, 901, 966 ర్యాంకులు సాధించారని అన్నారు. ఎస్సార్ విద్యా సంస్థల్లో ఎప్పటికప్పుడు వినూత్న పద్ధతిలో విద్యా బోధన చేస్తున్నామన్నారు. ఆధునిక పద్ధతుల్లో పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్న ఎస్సార్ విద్యా సంస్థలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయ కేతనం ఎగురవేస్తున్నారన్నారు. యాభై ఏళ్లుగా తల్లిదండ్రుల కలను సాకారం చేస్తూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందజేస్తున్నా మన్నారు. ఎస్సార్ ఫలితాలు విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయమన్నారు. జేఈఈ అడ్వాన్స్‌లో జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు సంతోష్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలతో కలిసి చైర్మన్‌వరదారెడ్డి అభినందించారు.

'నీట్' లీకేజీపై విచారణ జరిపించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 9: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై వెంటనే విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పూట్కూరి ప్రవీణ్‌గౌడ్, భాషబోయిన సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులు రావడం, వారందరిది ఒకే పరీక్ష కేంద్రం కావడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపించాలని వారు డిమాండ్ చేశారు.

నెత్తురోడిన రహదారులు

- వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో ప్రమాదాలు
- ఏడుగురి మృతి, మరో ఏడుగురికి తీవ్ర గాయాలు

పెబ్బేరు/ సదాశివపేట/ కృష్ణకాలనీ, జూన్ 9: రాష్ట్రంలో ఆదివారం రహదారులు నెత్తురోడాయి. వనపర్తి, సంగారెడ్డి, భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుజరాత్‌కు చెందిన జైన సాధువులు విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, ప్రియాంకర్ రాజ్, భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా, పునీత్ మహరాజ్ మత ప్రచారం నిమిత్తం కాలినడకన బయలుదేరి శనివారం రాత్రి వనపర్తి జిల్లా రంగాపురం గ్రామంలో బసచేశారు. తిరిగి ఆదివారం తెల్లవారుజామున బయలుదేరిన వారిని రంగాపురం శివారులో హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్‌భాయ్(36), హేమల్ ప్రవీణ్‌షా (32) అక్కడికక్కడే మృతి చెందగా, విజ్ఞాన్ ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ రాజ్ తీవ్రంగా గాయపడటంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్(50) మృతి చెందారు. మిగిలిన ఇద్దరినీ మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంగారెడ్డి జిల్లాలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉన్నాల్ గ్రామానికి చెందిన దంపతులు హజీ షాబాజ్ కుటుంబంతో కారులో ఆదివారం హైదరాబాద్ నుంచి బీజాపూర్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ అతివేగంగా వారి కారును ఢీకొట్టింది. అదే సమయంలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఓ ఆయిల్ ట్యాంకర్ కూడా బలంగా కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల మధ్యన కారు ఇరుక్కుని నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో షాబాజ్ భార్య నస్రీన్ బేగం(35), మహారాష్ట్రలోని ముంబైకి చెందిన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ్ దూబే(45) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన హజీ షాబాజ్, అతడి కుమారులు జునైద్, అబ్దుల్లాతో పాటు, మరో లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. ఘటనలో భూపాలపల్లి జిల్లాలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. భూపాలపల్లి జిల్లా కమలాపూర్‌కు చెందిన రేగళ్ల నరేశ్(38), రేగళ్ల ప్రమోద్ (24), రేగళ్ల సిద్దు పని నిమిత్తం ఒకే బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మేడారం నుంచి భూపాలపల్లికి వెళ్తున్న కారు అదుపుతప్పి కమలాపూర్ వద్ద వీరి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో ప్రమోద్ మృతి చెందగా.. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


సంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విజయవాడ-హైదరాబాద్ హైవేపై దోపిడీ

- కారులో నిద్రిస్తున్న వారిపై దుండగుల దాడి
- ఆపై రూ.3 లక్షల విలువైన ఆభరణాల చోరీ
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

చిట్యాల రూరల్, జూన్ 9: నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున దారిదోపిడీ జరిగింది. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయిన దంపతులు హైవే పక్కన బస్‌బే మార్గంలో కారులో విశ్రాంతి తీసుకుంటుండగా దొంగలు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం తోట్లపాలెం గ్రామానికి చెందిన పంచాక్షరి-అఖిల దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు దేవాంశ్ ఉన్నాడు. పంచాక్షరికి సోదరి శ్రుతి ఉంది. పంచాక్షరి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థలో, శ్రుతి మరో సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం తోట్లపాలెం నుంచి పంచాక్షరి-అఖిల దంపతులు, వారి కుమారుడు దేవాంశ్, శ్రుతి కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. విజయవాడ-హైదరాబాద్ హైవేలోని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తికి వచ్చేసరికి కారు నడుపుతున్న పంచాక్షరి అలసిపోయాడు. నిద్ర వస్తుండటంతో ఆదివారం వేకువజామున 2.30 గంటలకు కారును సర్వీస్ రోడ్డులోని బస్‌బేలో ఓ ట్రాలీ వెనుక వాహనాన్ని నిలిపాడు. కార్ డోర్‌లాక్ వేసి లోపల నిద్రించారు. సుమారు 3.45 గంటల ప్రాంతంలో ఇద్దరు దొంగలు ముఖం కనబడకుండా వస్త్రాలు కట్టుకుని పెద్దబండరాయితో కారు ముందుభాగంలోని కుడి, ఎడమవైపు అద్దాలను ధ్వంసం చేశారు. ముందుసీట్లలో నిద్రిస్తున్న పంచాక్షరిని, శ్రుతిని కారులోంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. పంచాక్షరి వేలికి ఉన్న 10 గ్రాముల బంగారు ఉంగరం, శ్రుతి మెడలోని 10 గ్రాముల బంగారు గొలుసు, అఖిల మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని సమీపంలోని తోటలోకి పారిపోయారు. దుండగుల దాడిలో గాయపడిన పంచాక్షరి, శ్రుతిలను గమనించిన ఓ వ్యాన్ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి.. వారిని చౌటుప్పల్‌లోని ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లాడు. కాగా, దోపిడీ జరిగిన ప్రాంతాన్ని నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి ఆదివారం పరిశీలించారు.

అమరావతిలో మొదలైన పనులు

200 పొక్లెయిన్లతో జంగిల్ క్లియరెన్స్.. పిచ్చి మొక్కలు తొలగింపు

- రహదారుల బాగు పనులు షురూ
- ఆగిపోయిన నిర్మాణాలు ప్రారంభం
- రాజధానిలో సీఎస్ సుడిగాలి పర్యటన

తుళ్లూరు, జూన్ 9: గత ఐదేళ్లుగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మళ్లీ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అమరావతిలో నిలిచిపోయిన వివిధ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి గతంలో భూమి పూజ జరిగిన ఉద్దండరాయునిపాలెంలోని సీఆర్‌డీఏ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణం పూర్తికావచ్చిన సీఆర్డీఏ రీజినల్ కార్యాలయాన్ని, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఏపీ ఎన్జీవో నివాస భవనాల సముదాయాలను.. హైకోర్టు తదితర ప్రాంతాలను సీఎస్ పరిశీలించారు. శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల ఫౌండేషన్ వరకు వచ్చి ఆగిపోయిన ప్రాంతాల్లో పర్యటించారు. రాజధాని ప్రాంతం చిట్టడవిలా మారి ఉండడంతో తొలుత పెద్దఎత్తున జంగిల్ క్లియరెన్స్ పనులకు ఆదేశించారు. 200 పొక్లెయిన్లు చిట్టడవిగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాయి. పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. రోడ్లు బాగు చేయడంతోపాటు గతంలో జరిగిన నిర్మాణాల వద్ద మళ్లీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా, జంగిల్ క్లియరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలని సీఎస్ నీరబ్ కుమార్ సూచించారు. రాజధానిలో అన్నిచోట్లా వీధి లైట్లు వెలగాలని సీఆర్డీయే అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో సీఎస్ అమరావతి పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. సీఎస్‌తో పాటు సీఆర్డీఏ కమిషనర్ వివేక్, అదనపు కమిషనర్, సీఆర్డీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విలేకరులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి 25 ప్రదేశాలను గుర్తించామని చెప్పారు. రాజధాని రైతుల వార్షిక కౌలును త్వరలోనే అందజేస్తామని చెప్పారు. రాజధానిలో చంద్రబాబు అప్పగించిన పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు ముమ్మరం చేస్తామని ప్రకటించారు. రేయింబవళ్లు జేసీబీ యంత్రాలు జంగిల్ క్లియరెన్స్ పనులలో నిమగ్నమయ్యాయని, ఇప్పటికే 80 యంత్రాలు పనులు చేస్తున్నాయని తెలిపారు. నిర్మాణంలో వినియోగించి తుప్పుపట్టిన ఇనుము విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు.


రాజధాని అమరావతిలో పర్యటించిన ఏపీ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్

చకచకా పనులు

- చంద్రబాబు ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీజీపీ

గన్నవరం, జూన్ 9: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 12వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలో నిర్వహించే ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం 17 ఎకరాల విస్తీర్ణంలో సీనియర్ అధికారులు, టీడీపీ నేతల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు ఆదివారం పరిశీలించారు. 60 మంది కూర్చునే విధంగా 80 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు, 8 అడుగల ఎత్తులో స్టేజీని నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజల కోసం 800 అడుగుల పొడవు, 420 అడుగుల వెడల్పు ఉన్న జర్మన్ హ్యాంగర్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాని మోదీతోపాటు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖులు వస్తుండటంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి!

- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
- రూ.8 లక్షల పరిహారంతో రాజీ!

గద్వాల క్రైం, జూన్ 9: కాన్పు కోసం వచ్చిన ఓ గర్భిణి అనుమానాస్పద స్థితిలో ఆస్పత్రిలో చనిపోయింది. అయితే, డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఆమె చనిపోయిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన శివలీల(19)కు గత ఏడాది అదే మండలంలోని కుర్వపల్లికి చెందిన రాజుతో వివాహమైంది. నిండు చూలాలు అయిన శివలీలను ఈనెల 5న కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గర్భంలోని బిడ్డ హృదయస్పందన సక్రమంగా లేదని, వెంటనే సిజేరియన్ చేయాలని వైద్యులు సూచించారు. మరుసటి రోజు సిజేరియన్ చేయగా శివలీలకు మగ శిశువు జన్మించాడు. అయితే ప్రసవం అయిన వెంటనే బాలింత కోమాలోకి వెళ్లింది. దాంతో ఆమెను ఆస్పత్రి సిబ్బంది కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి బాలింత మృతి చెందిందని కర్నూల్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. అయితే శివలీల అంతకుముందే చనిపోయిందని, అయినా వైద్యులు దాచిపెట్టారని ఆమె బంధువులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే శివలీల చనిపోయిందని గద్వాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కుర్వపల్లికి చెందిన ఓ నాయకుడు బాధిత కుటుంబానికి రూ.8లక్షల పరిహారం ఇచ్చేలా మాట్లాడి పంచాయితీ తెంచినట్లు తెలిసింది.

జూరాలకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అమరచింత, జూన్ 9: జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల పరిధిలోని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆదివారం జూరాల ప్రాజెక్టుకు 3,830 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. జూరాల ప్రాజెక్టులో గత వారం 3.744 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రస్తుతం నీటి నిల్వ 4.618 టీఎంసీలకు చేరింది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండటంతో రెండు రోజులుగా జూరాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉంటోంది. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి సత్యసాయి పంప్ హౌస్‌ల ద్వారా సాగునీటి సరఫరా, ఇతర అవసరాలకు 149 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

సారీ తమ్ముడు చచ్చిపోతున్నా..

- భార్య వివాహేతర సంబంధం
- మనోవేదనతో భర్త ఆత్మహత్య
- చనిపోయే ముందు సెల్ఫీ వీడియో

హుజూర్‌నగర్, జూన్ 9: "అరె తమ్ముడు, నా పిల్లలను మంచిగా చూసుకోరా. చెల్లి స్వప్న.. నేను చచ్చిపోతున్నా! మన కుటుంబాల్లో ఇలాంటి వాళ్లు ఉండొద్దు. ఎంతకైనా పోరాడు, వదలొద్దు".. అంటూ భార్య వ్యవహారంతో విసుగుచెందిన ఓ భర్త ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో వెళ్లగక్కిన ఆవేదన ఇది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, వద్దని వారించినా వినకపోవడంతో విసుగెత్తిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. హుజూర్‌నగర్‌కు చెందిన చిట్టిప్రోలు రంజిత్(35) వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్. మండలంలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మహిళను 14 ఏళ్ల కిందట ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికంగా సీతారాంనగర్ కాలనీలో రంజిత్ కుటుంబం అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. తన భార్య ఒక హోటల్ యజమాని కుమారుడితో వివాహేతర సంబంధం నెరుపుతున్నట్లు రంజిత్‌కు తెలిసింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణ జరిగేది. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం రంజిత్ భార్య ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రంజిత్ తన పిల్లలను తీస్కోని మఠంపల్లిలోని చెల్లెలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం హుజూర్‌నగర్‌కు తిరిగొచ్చిన రంజిత్ ఇంట్లో ఉరివేసుకున్నాడు. అంతకు ముందే సెల్ఫీ వీడియోలో తన చావబోతున్నానని, అందుకు భార్య తీరు కారణమని, తన పిల్లలను బాగా చూసుకోవాలని తమ్ముడు, చెల్లెల్ని వేడుకున్నాడు. శనివారం సాయంత్రం రంజిత్ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. కాగా రంజిత్ పెట్టుకున్న సెల్ఫీ వీడియో వాట్సాప్ స్టేటస్‌ను అతని మిత్రుడు ఆలస్యంగా గమనించడంతో ఈ వీడియో వ్యవహారం బయటకు వచ్చింది. కాగా, రంజిత్ మృతికి కారణమైన భార్య, హోటల్ యజమాని కుమారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు సమాచారం. హోటల్ యజమాని కుమారుడు, రంజిత్ భార్యను కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది కీలక నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.


రంజిత్(ఫైల్)

టెస్కాబ్‌లో అవిశ్వాసంపై నేటి సమావేశం రద్దు!

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్)లో సోమవారం నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై సమావేశం రద్దు అయ్యింది. ఇప్పటి వరకు టెస్కాబ్ ఛైర్మన్‌గా కొనసాగిన కొండూరు రవీందర్‌రావు, వైస్ ఛైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిలపై పాలకవర్గ సభ్యులు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెడుతూ నోటీసు ఇచ్చిన విషయం విదితమే. అయితే అవిశ్వాసాన్ని ఎదుర్కోవటం ఇష్టం లేని రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డి ఇటీవల తమ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులకు రాజీనామా చేశారు. దీంతో అవిశ్వాసంపై సమావేశంతో అవసరం లేకుండాపోయింది. అయితే పాలకవర్గాన్ని ఎన్నుకోవటానికి నేడో, రేపో సమావేశం కానున్నారు. మెదక్ జిల్లా డీసీసీబీ ఛైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డిని టెస్కాబ్ ఛైర్మన్‌గా చేయటానికి ముఖ్యమంత్రి, మంత్రివర్గం సుముఖంగా ఉన్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాతే ఎన్నిక నిర్వహించనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెస్కాబ్ పాలకవర్గ ఎన్నికలు లాంఛనంగా జరగనున్నాయి.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో కరెంటు షాక్‌తో అన్నదాత మృతి

పాపన్నపేట/నార్కట్‌పల్లి, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని కొత్తపల్లిలో టప్ప మల్లేశం(38) అనే రైతు కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. వడగళ్ల వానతో పంట దెబ్బతినడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రుణభారం పెరిగిపోవడంతో గత నెల 30న కౌలు తీసుకున్న పొలం వద్ద పురుగు మందు తాగాడు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఇక, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బెండల్‌పహాడ్‌కు చెందిన యానాల కృష్ణారెడ్డి (58) అనే రైతు విద్యుదాఘాతంతో పొలంలోనే ప్రాణాలు వదిలాడు. కౌలుకు తీసుకున్న పొలంలో ఉన్న బోరు మోటారుకు మరమ్మతులు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

'హాక్ ఐ' హ్యాకర్ అరెస్టు

- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసు శాఖకు చెందిన హాక్ ఐ, టీఎస్ కాప్, ఎస్ఎంఎస్ పోర్టల్ యాప్‌లను హ్యాక్ చేసి డేటా చోరీ చేసిన హ్యాకర్‌ను అరెస్టు చేసినట్లు డీజీపీ రవిగుప్తా తెలిపారు. ఈ నెల 8న ఢిల్లీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హ్యాకర్ చోరీ వివరాలను databreachforum.st లో పోస్ట్ చేసి, ఆ డేటాను 150 డాలర్ల (రూ.12,529)కు అమ్మకానికి పెట్టాడని తెలిపారు. ఆసక్తి గలవారు సంప్రదించడానికి టెలిగ్రామ్ ఐడీలు కూడా అందులో ఉంచినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అధునాతన సాంకేతికతతో ఢిల్లీలో 20ఏళ్ల జతిన్ కుమార్(యూపీకి చెందిన)ను నిందితుడిగా గుర్తించారన్నారు. అతడిని ట్రాన్సిట్ రిమాండ్‌పై హైదరాబాద్‌కు తీసుకురానున్నట్లు వివరించారు. కాగా, హాక్‌ఐ యాప్ డేటాలో మొబైల్ నంబర్, చిరునామా, ఈమెయిల్ ఐడీ వంటి సమాచారమే ఉంటుందని.. డీజీపీ తెలిపారు. వినియోగదారుల వ్యక్తిగత సమాచారం లీక్ కాలేదన్నారు.

సైబర్ బాధితులకు రూ.7.9 కోట్లు రికవరీ చేశాం

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్ము రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా అన్ని జిల్లాలు, పోలీస్ కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. టీజీసీఎస్‌బీలో 4,144 కేసులు నమోదు కాగా, జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసుల్లో బాధితులకు రూ.7.9 కోట్ల సొమ్మును తిరిగి ఇప్పించగలిగామని వివరించారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులను పరిష్కరించి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన రూ.3,66,83,748ను బాధితులకు ఇప్పించినట్లు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

వానాకాలం మొదలైనా పెట్టుబడి సాయమేదీ?

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు
- విత్తనాల కొరత రాకుండా చూడటంలో విఫలం: హరీశ్‌రావు

నంగునూరు, జూన్ 9: వానాకాలం మొదలైనా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. విత్తనాలకు కొరత లేకుండా చూడటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగుచేసిన ఆయిల్ పామ్ మొదటి పంట కోత పనులు ఆదివారం చేపట్టగా.. హరీశ్‌రావు ఆ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. పంట బోనస్ హామీ బోగస్‌లా మారిందని విమర్శించారు. కేవలం సన్న వడ్లకే బోనస్ అనడం మాట తప్పడమేనన్నారు. రాష్ట్రంలో 90శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారన్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. అలాగే, పామాయిల్ దిగుమతిపై తొలగించిన సుంకాన్ని మళ్లీ విధించాలని హరీశ్‌రావు ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ రైతులను ప్రోత్సహించాలన్నారు.


ఆయిల్ పామ్ గెలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

గాయత్రి మాతకు ప్రత్యేక పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 9 : మహబూబాబాద్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం అర్చకుడు తాటిపాముల శివక్రిష్టాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో గాయత్రిమాత హోమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ పమ్మి సనాతనాచారి, ప్రధానకార్యదర్శి తాడూరి మాధవాచారి, భక్తులు పాల్గొన్నారు.

గొల్లగూడెంలో బీరన్నకు పూజలు



బీరన్న దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న కురుమ, యాదవులు

గూడూరు, జూన్ 9: గూడూరు శివారు గొల్లగూడెంలో కురుమ, యాదవుల ఆరాధ్య దైవమైన బీరన్న-కామరావతిలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి బీరన్న-కామరావతిల విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అర్చకుడు భానుప్రకాష్ వేదమంత్రోచ్చరణల నడుమ అష్టలక్ష్మి, కుంకుమ, గణపతి పూజలతో పాటు అభిషేకాలు, కుంభదృష్టి నిర్వహించారు. కురుమ, యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కుల పెద్దలు మండల కొమురయ్య మంగ చేరాలు, చీరె భిక్షపతి, కుండె కిషన్, కోరె పాపయ్య, దూడె మల్లయ్య, కోరె కొమురయ్య, మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

▸▸ పూర్వ విద్యార్థి, ఏసీఎఫ్ అప్పయ్య



మాట్లాడుతున్న ఏసీఎఫ్ అప్పయ్య

కేసముద్రం, జూన్ 9 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించి భవిష్యత్‌లో అన్ని రంగాల్లో రాణిస్తారని ఉప్పరపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థి, హైదరాబాద్ అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(ఏసీఎఫ్) ఎనల్ల అప్పయ్య అన్నారు. గ్రామంలో ఆదివారం జడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి అప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తాను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని చెప్పారు. డీఈవో రామారావు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.విజయసుశీల, వీవో సీఏ వచ్చాల సాంబయ్య, మాజీ సర్పంచ్ శ్రీరామోజు మహేశ్వరాచారి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నూకల వెంకటేశ్వర్లు, కోమల, అరుణ, నారాయణమ్మ, ఉపాధ్యాయులు ఎం.రవీందర్, ఆర్.కోటేశ్వర్లు, అర్.ఏకాంబ్రం, ఎ.సంపత్‌రెడ్డి, కృష్ణమోహన్, దురేష్, మహ్మద్ అలీ, పీఈటీ కొప్పుల శంకర్ పాల్గొన్నారు.

గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం ఇనుగుర్తి అధ్యక్షుడిగా మధు



ఇనుగుర్తి, జూన్ 9: గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం ఇనుగుర్తి గ్రామ అధ్యక్షుడిగా కూటికంటి మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో ఆదివారం సమావేశం జరుగగా, అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శిగా గండి అశోక్, కోశాధికారిగా వేముల శ్రీనివాస్‌తో పాటు మరో వంద మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కూటికంటి మధు మాట్లాడుతూ... గౌడ కులస్తులను ఐక్యం చేసి తమ అస్థిత్వాన్ని కాపాడుతామని చెప్పారు. ఆర్థిక అవసరాలకు గౌడ కౌండిన్య సంక్షేమ సంఘం ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో శ్రీను, అజయ్, శ్రీకాంత్, మధు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాలివ్వాలి

▸▸ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉపేందర్

మహబూబాబాద్ టౌన్, జూన్ 9: అనేక నెలలుగా గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే వారికి వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని సమావేశాన్ని ఆదివారం ధర్మారపు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కుంట ఉపేందర్ మాట్లాడుతూ... గత 11 నెలలుగా జీపీ సిబ్బందికి వేతనాలు అందక ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు ఇవ్వాలని లేనిపక్షంలో ఈ నెల 15న జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట ఆందోళనచేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మొయినుద్దీన్, లతీఫ్, వెంకన్న, యాకయ్య, జానిమియా, చంద్రకళ, ఎల్లమ్మ, సురేష్, వీరన్న పాల్గొన్నారు.

టీఎస్ జేఎఫ్‌వోఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాంబు



కొత్తగూడ, జూన్ 9 : తెలంగాణ రాష్ట్ర జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీఎస్ జేఎఫ్‌వోఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బి.సాంబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో రాష్ట్ర కమిటీ ఎన్నికను నిర్వహించారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న సాంబును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కాగా, సాంబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూన్ 9 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 ఏఈ నవ్యశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పులి గోపాల్‌రావు నగర్, ఇన్‌కేబుల్ కాలనీ, రెడ్డిబజార్, మార్వాడి సత్రం, జిల్లా ఆస్పత్రి ఏరియా, కురవి రోడ్, సాలార్‌తండా, అయ్యప్పనగర్, కవిత కాలనీలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు చెట్లకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అమనగల్ సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెన్స్ కారణంగా శనిగపురం, వావిలాల, నర్సింహులగూడెం, గుండాలగడ్డతండా, బోరింగ్‌తండా గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు రూరల్ ఏఈ భోజ్యానాయక్ తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాట్రపల్లి శివాలయానికి స్థలం విరాళం

కేసముద్రం, జూన్ 9 : మండలంలోని కాట్రపల్లి శివకోటేశ్వర స్వామి దేవాలయానికి మాజీ ఉపసర్పంచ్ పాల్వాయి లక్ష్మారెడ్డి, మనోహరదేవి దంపతులు ఆలయం ముందు మూడు గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి విరాళంగా ఇచ్చారు. స్థలానికి సంబంధించిన పత్రాలను ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో జల్లె రవీందర్, పుల్ల శ్రీనివాస్, పాల్వాయి వెంకటరెడ్డి, సిరికొండ మల్లయ్య, ఎదురబోయిన సూరయ్య, వెంకటాచారి పాల్గొన్నారు.

శ్రమ ఫలితం కష్టజీవులకే దక్కాలి

తొర్రూరు, జూన్ 9 : కార్మికవర్గం రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమిస్తుంటే ఫలితం దక్కడం లేదని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కె.రవి అన్నారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఏరియా 3వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోట్లాది మంది కార్మికులు శ్రమనే కష్టంగా మార్చి పనులు చేస్తుంటే పెట్టుబడి సామ్రాజ్యవాద దోపిడీదారులు మరోవైపు నిలిచారని, ఓట్ల ద్వారా అధికారంలోకి వస్తున్న రాజకీయ పార్టీలు కష్టజీవుల వైపు కాకుండా ధనికుల వైపు చూడడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల చట్టాలను, లేబర్ కోడ్‌లను రద్దుచేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. అనంతరం 15 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తొర్రూరు ఏరియా నూతన అధ్యక్షుడిగా శ్రీరాం పుల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కొమురయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.యాకూబ్, కార్యదర్శిగా బానోత్ రామ్‌లాల్, కోశాధికారిగా ఎస్.వెంకన్నతో పాటు మరో 10 మందిని ఎన్నుకుననట్లు తెలిపారు. కార్యక్రమంలో నవీన్, బీకు, యాకయ్య, రమేష్, మహేష్, సంఘాల నాయకులుపాల్గొన్నారు.

ఆగ్రోస్ కేంద్రాలపై కేసులు నమోదు

తొర్రూరు, జూన్ 9: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడిన తొర్రూరు మండల పరిధిలోని 4 ఆగ్రోస్ కేంద్రాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ ఆదివారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు వ్యవసాయ శాఖ సహాయ విస్తరణ అధికారి కె.శోభన్ బాబు ఫిర్యాదు చేయగా ఆగ్రోస్ సెంటర్ నిర్వాహకులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదిలేది లేదని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా దళారులకు పచ్చిరొట్ట విత్తనాలు విక్రయించిన ఆగ్రోస్ నిర్వాహకులపై చర్యలుంటాయని పేర్కొన్నారు.

మహిళలు మెన్‌విల్ కప్స్‌ను ఉపయోగించాలి

మరిపెడ, జూన్ 9 : మహిళలు సంపూర్ణ ఆరోగ్యం కోసం మెన్‌విల్ కప్స్‌ను ఉపయోగించాలని బాలవికాస ప్రతినిధి వసంత అన్నారు. ఆదివారం మరిపెడలోని బాలవికాస భవన్‌లో మహిళలకు అమెజాన్ వారి సౌజన్యంతో మహిళల సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలవికాస కో-ఆర్డినేటర్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ నెలసరి సమయంలో ప్రతి మహిళ తప్పనిసరి మెన్‌విల్ కప్స్ ఉపయోగిస్తే క్యాన్సర్ లాంటి జబ్బులు దరిచేరవన్నారు. అమెజాన్ అందచేసిన మెన్‌విల్ కప్స్‌ను మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మరిపెడ బాలవికాస కోఆర్డినేటర్లు గంధసిరి ఉపేంద్ర, జుజ్జూరి ఉపేంద్ర, జొనికెన ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



జెండా ఆవిష్కరిస్తున్న సుధాకరాచారి

తొర్రూరు, జూన్ 9: విద్య, ఉపాధ్యాయ రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి అన్నారు. ఆదివారం ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జెండాఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 317 జీవోతో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు నేటికీ విడుదల చేయకపోవడం సరికాదన్నారు. షెడ్యూల్ ప్రకారమే ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమయ్యే వరకు దశలవారీగా పోరాటాలు చేస్తామని తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయుడు చంద్రప్రకాశ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాకూబ్ రెడ్డి, చంద్రప్రకాశ్, చంద్రమౌళి, హైమావతి, శారదాదేవి, హరికృష్ణ, సోమేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

ప్రధాని ప్రమాణస్వీకారానికి హెచ్ఎంకు ఆహ్వానం

కేసముద్రం, జూన్ 9 : ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి కేసముద్రం మండలం పెనుగొండ శివారు నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొడిపాక రమేష్‌కు దూరదర్శన్ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆదివారం ఆయన ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మాజీ ఎంపీపీ ఆత్మహత్య



గండి బాబు (ఫైల్)

మరిపెడ రూరల్, జూన్ 9 : కడుపునొప్పి బాధ భరించలేక ఓ మాజీ ఎంపీపీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై తాహెర్‌బాబా తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గండి బాబుగౌడ్(65) వారం రోజుల నుంచి విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఆ బాధ భరించలేక ఆదివారం ఉదయం ఇంట్లోనే ఉరివేసుకొని చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి తరలించారు. ఆయన భార్య, కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాబు గౌడ్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మాజీ ఎంపీపీ మృతి చెందారన్న వార్త దావనలంలా వ్యాపించింది. దీంతో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ పర్కాల శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది కొండపల్లి కేశవరావు, రావుల రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, పానుగోతు రాంలాల్, గంధశిరి అంబరీష, కాల రవీందర్‌రెడ్డి, మెంచు అశోక్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డిలు బాబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.


జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో శివాని జయకేతనం



కె.పృథ్వీరాజ్ | బి.బన్నీ | బి.థామస్ | ఎం.కిషోర్ | డి.అఖిల్ | బి.నోయల్ | బి.అశోక్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 9 : జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో శివాని విద్యార్థులు జయకేతనం ఎగురవేశారని ఆ కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి అన్నారు. కె.పృథ్వీరాజ్ 105, బి.బన్నీ 286, బి.థామస్ 483, ఎం.కిషోర్ 1054, డి.అఖిల్ 1225, బి.నోయెల్ 1341, బి.అశోక్ 1671 ర్యాంకులు సాధించారన్నారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం శివాని విద్యార్థులకే సాధ్యమన్నారు. పటిష్టమైన ప్రణాళికతో వినూత్న రీతుల్లో ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన చేయడం వల్లనే శివాని విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారన్నారు.

ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాళ్లు జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి.రాజు, ఎన్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్ రెడ్డిలు అభినందించారు.



పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



డోర్నకల్‌లో సమ్మేళనంలో పాల్గొన్న డీడీ హైస్కూల్ విద్యార్థులు



గార్లలో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

డోర్నకల్, జూన్ 9 : డోర్నకల్‌లోని డయాసిస్ హైస్కూల్ 1984-85 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఆ పాఠశాలలో కలుసుకుని ఒకనొకరు ఆలింగనం చేసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. పాఠశాల ప్రాంగణం మొత్తం కలియ తిరిగారు. విద్య వ్యాపారాల రీత్యా దూర ప్రాంతాల్లో స్థిరపడ్డ స్నేహితులు అందరూ ఒకచోట కలుసుకుని ఆనందంగా గడిపారు.

ఈ కార్యక్రమంలో మల్లం అనిల్, కిరణ్, బాలరాజు, రాజశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, దినేష్‌జైన్, సారయ్య మోజేస్, సుకుమార్, ఎర్నేస్ట్, జహీర్, ఎ.శ్రీనివాస్, రాంబాబు, సురేష్, బిచ్యానాయక్, పాల్వాయి మాధవ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

● గార్ల : గార్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గత 40 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థులు ఒక్క చోట కలుసుకుని నాడు పాఠశాలలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వి.మహేష్, వడ్లమూడి దుర్గా ప్రసాద్, రాఘవేందర్‌రావు, షేక్ బుడాన్, లక్ష్మీనారాయణ, గట్టు భాస్కర్, గోరంట్ల రామారావు, దయాకర్, నీరజ, భారతి, ఉషారాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మహబూబాబాద్‌టౌన్, జూన్9: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ ధరంసోత్ నారాయణసింగ్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ ముగిసినందున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25వేల పెన్షన్‌ను ఇవ్వాలని కోరారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బొర్రాజు లింగన్న, గుంజె హన్మంతు, భూక్య రమేష్, వీరబోయిన నరేష్, భూక్య రాము పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కేసముద్రంలో వీరన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

కేసముద్రం, జూన్ 9 : కేసముద్రం మండలం కల్వలలో కొండ్రెడ్డి రాంరెడ్డి, కేసముద్రం స్టేషన్‌లో అంగోత్ వీరన్న, కేసముద్రం విలేజిలో వేముల సత్తిరెడ్డి మృతి చెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే మురళీనాయక్ ఆదివారం పరామర్శించారు. కేసముద్రం విలేజిలో ప్రమాదంలో గాయపడిన పెండెం లక్ష్మయ్య, వరంగల్ అజరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సబ్‌స్టేషన్‌తండా తాజా మాజీ సర్పంచ్ గుగులోత్ వెంకన్న, హనుమకొండలో చికిత్స పొందుతున్న మాజీ వైస్ ఎంపీపీ మూరగుండ్ల అనంతరాములును పరామర్శించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, వెంకట్‌రెడ్డి, గండి శ్రీనివాస్, రావుల మురళి పాల్గొన్నారు.

● ఇనుగుర్తి : ఇనుగుర్తి గ్రామ పార్టీ మాజీ అధ్యక్షుడు కొడకండ్ల రాంరెడ్డి శనివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఆదివారం ఇనుగుర్తికి చేరుకుని రాంరెడ్డి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంజి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుజ్జనూరి బాబురావు, కట్టయ్య, మురళి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

గార్ల, జూన్ 9 : గార్ల మండల పరిధిలోని పుల్లూరు లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయం ఆవరణలో జిల్లా కోర్టు పీపీ కీసర పద్మాకర్‌రెడ్డి-సుధ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువు పట్ల ఆసక్తిని పెంచుకుని ఉన్నత చదువులు చదవాలన్నారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాంరెడ్డి, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

మహబూబాబాద్ టౌన్, జూన్ 9 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జీవవైవిధ్య కమిటీ సభ్యుడు, హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఆదివారం మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. అడవులు అంతరించి పోయి రోజు రోజుకు పెరుగుతున్న వేడితో మానవులు బతకలేని పరిస్థితి నెలకొంటున్నందున మొక్కలు నాటి అడవులను పెంచాలని అన్నారు. కేరళ తరహాలో మొక్కలను పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామన్నారు. ఎవరికి మొక్కలు అవసరమున్నా 81060 72005 నంబరుకు ఫోన్ చేస్తే ఇంటికి పంపిస్తామని తెలిపారు.

వృద్ధురాలికి నేత్ర యూత్ ఆర్థిక సాయం



వృద్ధురాలికి సాయం చేస్తున్న నేత్ర యూత్

గూడూరు, జూన్ 9 : మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిరుపేద ఆదివాసీ వృద్ధురాలు పొడుగు సోమక్కకు అదే గ్రామానికి చెందిన నేత్ర యూత్ సభ్యులు రూ.25వేల ఆర్థిక సాయం అందించారు. గత కొద్దికాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలి విషయం తెలుసుకున్న నేత యూత్ సభ్యులు ఆదివారం వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా నేత్ర యూత్ వ్యవస్థాపక సభ్యుడు బుడిగె సతీష్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో ఏ పేద కుటుంబానికి ఆపద వచ్చినా నేత్ర ఆధ్వర్యంలో ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు భూపతి శ్రీను, మేరెడ్డి సుమన్, బొల్లి సారయ్య, దోసపాటి మహేష్, కారింగుల శ్రీను, దొనికెల నరేష్, కార్తీక్, క్రాంతి, సురేష్, లోకేష్, గణేష్, అనిల్, ప్రశాంత్, బత్తుల రామన్న, పూనెం యాకయ్య కుమారస్వామి, యాకాచారి, హరికృష్ణ, మహ్మద్ అలీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో పలువురికి ర్యాంకులు



ఉల్లెంగుల ఝాన్సీ

కొత్తగూడ, జూన్ 9 : మండలంలోని వేలుబెల్లికి చెందిన ఉల్లెంగుల ఝాన్సీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియాలో 5,991వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో ఆల్ ఇండియాలో 1,201వ ర్యాంకు సాధించారు. గ్రామానికి చెందిన ఉల్లెంగుల స్వప్న, సురేష్ దంపతుల కుమార్తె ఝాన్సీ ప్రాథమిక విద్య నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించింది. నవోదయ ఎంట్రన్స్‌లో ర్యాంకు సాధించి నవోదయ పాఠశాలలో 10వ తరగతి వరకు చదివింది. పదవ తరగతిలో 580, ఇంటర్‌లో 984 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో 1,800 ర్యాంకు సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించింది. ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఝాన్సీ ర్యాంకు సాధించగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వర్షిత్‌రెడ్డికి ఆలిండియా 1,280 ర్యాంకు



వర్షిత్‌రెడ్డి

సీరోలు : జేఈఈ ఫలితాల్లో సీరోలు మండలం కాంపల్లికి చెందిన సుంకిరెడ్డి వర్షిత్‌రెడ్డి ఆలిండియా 1,280వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన సుంకిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి-స్నేహలతల కుమారుడు వర్షిత్‌రెడ్డి హనుమకొండలోని ప్రైవేటు పాఠశాలలో ఎస్సెస్సీ ఫలితాల్లో 10/10 జీపీఏ, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్‌లో 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించాడు. ఇటీవల వెలుబడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా లెవల్‌లో 559వ ర్యాంకు, టీఎస్ఈఏపీసెట్ ఫలితాల్లో 230వ ర్యాంకు సాధించాడు. వర్షిత్ రెడ్డి ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

ఈఎంఆర్ఎస్ విద్యార్థిని మహేశ్వరికి ర్యాంకు



భూక్య మహేశ్వరి

కురవి : జేఈఈ మెయిన్స్‌లో కురవి ఈఎంఆర్ఎస్ గురుకులంలో చదువుతున్న విద్యార్థిని భూక్య మహేశ్వరికి సీటు లభించింది. భూక్య మహేశ్వరికి జనరల్ కేటగిరి 16,504 ర్యాంకు రాగా, ఎస్టీ కేటగిరిలో 107 ర్యాంకు వచ్చింది. మహేశ్వరికి జేఈఈ మెయిన్స్‌లో తప్పక సీటు లభిస్తుందని ప్రిన్సిపాల్ సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని మహేశ్వరి మాట్లాడుతూ... తమకు కళాశాలలో జేఈఈ మెయిన్స్ శిక్షణ ఇప్పించిన ఏకలవ్య గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మికి, డిప్యూటీ సెక్రటరీ చంద్రకళకు కృతజ్ఞతలు తెలిపారు.

గౌడ కులస్తులు ఐకమత్యంగా ఉండాలి

కేసముద్రం, జూన్ 9 : గౌడ కులస్తులు ఆర్థికంగా బలోపేతమవుతూ ఐకమత్యంగా ఉండాలని కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్ అన్నారు. అమినాపురం సంక్షేమ సంఘం భవనంలో ఆదివారం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చీకటి వెంకట్రాంనర్సయ్య, ఊట్కూరి అశోక్, తండ వెంకన్న, శామకూరి నర్సయ్య బొగ్గుల నాగయ్య, చింతనూరి వెంకన్న, చీకటి వేలాద్రి, మోడెం రవీందర్, రావుల మల్లేశం, టి.వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

▸▸ రోడ్డు పక్కన ఉన్నవారి మీదికి దూసుకెళ్లిన కారు



ప్రమాదంలో గాయపడిన గద్దల అశోక్, కుందురు సురేష్, కుందురు రవి

పెద్దవంగర. జూన్ 9 : కారు అతి వేగంతో రోడ్డు పక్కన ఉన్న వారి మీదికి దూసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన ఘటన మండలంలోని అవుతాపురం గ్రామ శివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం... పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామ శివారులో పాలకుర్తి- నాంచారిమడూర్ ప్రధాన రహదారిపై ఖమ్మం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కారులో తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి జనగామ నుంచి వయా పాలకుర్తి మీదగా ఖమ్మం వెళ్తున్న క్రమంలో, అవుతాపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల అశోక్ (37), అతని బంధువులు కుందురు రవి (32), కుందురు సురేష్ (38)లకు మీదకు దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిలో కుందురు సురేష్‌కు తీవ్రగాయాలు కావడంతో వరంగల్ తరలించగా, అశోక్, రవిలను తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పెళ్లి తరువాత చాలామంది మహిళలు ఇళ్లకే పరిమితమై పోతారు. **జ్యోతి శ్రీవాస్తవ** పరిస్థితీ అదే. ఇంజనీరింగ్ చదివి... రాకెట్లు డిజైన్ చేసిన ఆమె కెరీర్... వివాహం అయ్యాక అమాంతం ఆగిపోయింది. కానీ బిడ్డ పుట్టాక... ఆమె ఆలోచనే మారిపోయింది. ఒక తల్లిగా గడించిన అనుభవాన్ని... ఫుడ్ బ్రాండ్‌గా మార్చి... పారిశ్రామికవేత్తగా సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. నేడు ఎందరో తల్లులకు అవగాహన కల్పిస్తున్నారు.



ఆ తల్లులకు వందనం

"అశోక విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం... 73 శాతం మంది భారతీయ మహిళలు మొదటి బిడ్డ పుట్టాక ఉద్యోగం వదిలేస్తున్నారట. ఆ నివేదిక చదివాక ఆశ్చర్యం అనిపించింది. ఇల్లు, పిల్లలు, బాధ్యతలంటూ ఆడవారు తమ కెరీర్ గురించి ఆలోచించడంలేదు. వెనక్కి తిరిగి చూసుకొంటే... నా పరిస్థితీ అదే. మా స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని మీరట్. కెమికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశాను. వెంటనే ఉద్యోగం వచ్చింది. వృత్తిలో భాగంగా భారత సైన్యం కోసం రాకెట్లు డిజైనింగ్ చేశాను. అది నాకు ఎంతో ఇష్టమైన కొలువు. దాని కోసం నానోటెక్నాలజీ, రాకెట్ ప్రొపెల్లెంట్స్‌లో స్పెషలైజేషన్ చేశాను. అయితే అక్కడ విపరీతమైన పని. క్షణం తీరిక దొరికేది కాదు. జీతం మాత్రం చాలా తక్కువ. పనికి... జీతానికి పొంతన లేదు. దాంతో రెండున్నరేళ్ల తరువాత, అంటే 2018లో ఉద్యోగం వదిలేశాను. అనంతరం ఫ్రీలాన్సర్‌గా కొన్ని వాయుసేన ప్రాజెక్ట్స్‌కు పని చేశాను. ఎందుకో అది కూడా నాకు సంతృప్తినివ్వలేదు. అదే సమయంలో నాకు పెళ్లయింది. కొన్నాళ్లు ప్రాజెక్ట్ కొనసాగించాను.

అనుభవం నుంచి...

ఏడాది తరువాత నేను గర్భవతిని అయ్యాను. అప్పుడు మొదలయ్యాయి నా కష్టాలు. పుట్టబోయే బిడ్డ కోసమే కాదు... నా గురించి కూడా నేను శ్రద్ధ తీసుకోవాలి కదా. అందుకే ప్రాజెక్ట్ అన్నీ పక్కన పెట్టేశాను. బాబు పుట్టాడు. తల్లి పాలు పట్టే విషయంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తరువాత వాడికి అందించే ఆహారం విషయంలోనూ అయోమయం. ఒక తల్లిగా పిల్లాడికి బలవర్ధకమైన ఆహారం ఇవ్వాలనేది నా తపన. చిరుధాన్యాల్లో అయితే పోషకాలు పుష్కలంగా ఉంటాయని, కొన్ని రోగాలను నయం చేసే శక్తి కూడా వాటిల్లో ఉందని అర్థమైంది. తల్లి పాలలోని గుణాలు ఇందులోనూ ఉన్నాయి. మిల్లెట్స్ పిల్లల ఎదుగుదలను గణనీయంగా పెంచుతాయని పలు నివేదికలు పేర్కొన్నాయి. వీటన్నటి నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందనిపించింది.

ప్రత్యేక కోర్సులు చదివి...

బిడ్డ పోషణకు సంబంధించి పూర్తి అవగాహన కావాలి. అందు కోసం యునిసెఫ్ 'ఐవైసీఎఫ్' (ఇన్‌ఫ్యాంట్ అండ్ యంగ్ చైల్డ్ ఫీడింగ్) కోర్సు చదివాను. దాంతోపాటే 'చైల్డ్ అండ్ మెటర్నల్ న్యూట్రిషన్' సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశాను. ఆ తరువాత నాలాంటి తల్లులకు పిల్లల ఆరోగ్యం, పోషకాహారం గురించి అవగాహన కల్పించేందుకు ఇన్‌స్టాగ్రామ్‌లో 'లిటిల్ చెర్రీ మామ్' పేరుతో పేజీ ఒకటి తెరిచాను. కెమికల్ ఇంజనీరింగ్ చదివిన నాకు ఫుడ్ ప్రాసెసింగ్ మీద అవగాహన ఉంది. భారీ ప్రాజెక్టులకు పని చేసిన అనుభవం ఉంది. అందుకే ఎవరో తెలిసీ తెలియక అన్న మాటలు నేను పట్టించుకోలేదు. నేను అందించే సమాచారం కొందరు చంటి బిడ్డల తల్లులకైనా చేరితే చాలనుకున్నాను.

ఆరంభంలో కొందరు నన్ను ఎగతాళి చేశారు. హేళనగా మాట్లాడారు. 'ఈమెకేం తెలుసు' అన్నట్టు కొందరు బంధువుల, స్నేహితులు నా మీద జోక్‌లు వేశారు. 'నాడు మంచి ఉద్యోగం వదిలి తప్పు చేశావు' అన్నారు. అవేవీ పట్టించుకోలేదు.



మా అబ్బాయి పేరుతో...

పసి పిల్లల ఎదుగుదలకు సంబంధించి ఆయుర్వేదంలో పేర్కొన్న వివిధ రకాల మూలికల గురించి కూడా చదివాను. వాటి ఔషధ గుణాలకు సంబంధించిన సమాచారం సేకరించి పెట్టుకున్నా. వీటన్నిటినీ క్రోడీకరించి, మిల్లెట్స్‌తో రోజుకు మూడు రకాల వంటలు ప్రయత్నించాను. పోషక విలువలే కాదు, రుచి కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. ఎందుకంటే రుచికరంగా లేకపోతే పిల్లలు ముట్టుకోరు. అలా కొన్ని రెసిపీలు సిద్ధమయ్యాక మా అబ్బాయి పేరుతో చిరుధాన్యాల ఆధారిత 'లిటిల్ చెర్రీ ఫుడ్స్' కంపెనీ ప్రారంభించాను. చిన్నారులకు నాణ్యమైన, పోషక విలువలు ఉన్న, తాజా ఆహారం అందించాలనే లక్ష్యంతో దీన్ని నెలకొల్పాను.

సవాళ్లు ఎదురైనా...

ఒకానొక దశలో ఇక నా వృత్తిగత జీవితం ముగిసిపోయిందని అనుకున్నా. ఆ సమయంలోనే ఇన్‌స్టాలో నేను పెట్టిన పోస్ట్‌లకు క్రమంగా వీక్షకులు పెరిగారు. కొద్ది రోజుల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటింది. అది నాకు నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆ ఉత్సాహంతోనే కంపెనీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చాను. అయితే దానికి డబ్బు ఎక్కడి నుంచి తేవాలి? అది పెద్ద సమస్యగా మారింది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మావారు నాకు అండగా నిలిచారు. కొంతవరకు ఆర్థిక వనరులు సమకూర్చారు. మిగిలిన పెట్టుబడి కోసం నేను ఆన్‌లైన్‌లో వర్క్‌షాప్స్ నిర్వహించాను. కానీ ఇంకా లోటు. దాంతో బ్యాంకు లోను తీసుకొని వ్యాపారం మొదలుపెట్టాను. సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ ప్రాంతాల్లోని నవజాత శిశువుల తల్లులకు చేరువయ్యే ప్రయత్నం చేశాను. తొలి విడత ఉత్పత్తులు మార్కెట్‌లోకి విడుదల చేసే నాటికి మావద్ద యాభై వేల పైచిలుకు తల్లులతో కూడిన అతిపెద్ద సమూహం ఒకటి ఏర్పడింది. ఆ తరువాత నా పని సులువైంది. కష్టానికి ఫలితం దక్కింది. ఏడాది తిరక్కుండానే మా బేబీ ఫుడ్స్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభించింది. ఇప్పుడు మా టర్నోవర్ కోటి రూపాయలు దాటింది. నేటికీ మిల్లెట్ ఫుడ్ మీద అవగాహన కల్పిస్తున్నాను. వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాను. సంపాదన, సంతృప్తి... రెండూ దక్కుతున్నాయి. ఇదంతా అంతమంది తల్లులు నాపై ఉంచిన నమ్మకం. ఆ తల్లులందరికీ నా వందనం."

మార్పు యోధులు...

వారియర్స్ వితవుట్ ఎ కాజ్...

పేదలకు, అణగారిన వర్గాలకు ఏదైనా మేలు చేద్దామనే తపనతో నలుగురు కాలేజీ అమ్మాయిలు ఏర్పాటు చేసిన ఈ ఎన్జీవో.. ఇప్పుడు మూడువందల మందికి పైగా వాలంటీర్లతో... దేశంలోని వివిధ నగరాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్పందించే మనసుంటే... సాయం చెయ్యడానికి వయసుతో, ఆర్థిక స్థాయితో సంబంధం లేదని నిరూపిస్తోంది ఈ యువ బృందం.



2020... జన జీవనంలో కొవిడ్ మహమ్మారి రేపిన అల్లకల్లోలాన్ని చూసి చలించిపోయారు అనూష అత్రి, భవానీ సింగ్, ఖుషీ సింగ్, వంశికా మెహతా. ఆ నలుగురు అప్పుడే టీనేజీ దాటిన స్నేహితులు. ఢిల్లీలో చదువుకుంటున్నారు. కనీస అవసరాలు తీరక అల్లాడిపోతున్న ప్రజానీకానికి తమ వంతుగా ఏదైనా చెయ్యాలనుకున్నారు. తమ పాకెట్ మనీని పోగేసి... మాస్కులు, శానిటైజర్లు కొని... మురికివాడల ప్రజలకు పంచిపెట్టారు. ఆ తరువాత నిత్యావసరాలను కూడా అందించారు. ఈ క్రమంలో... ఆ ప్రజల అత్యవసరాలను ప్రత్యక్షంగా గమనించి, అర్థం చేసుకున్నారు. సామాజిక సంక్షేమం కోసం ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించి, రిజిస్టర్ చేశారు. అదే 'వారియర్స్ వితవుట్ ఎ కాజ్'. "ఒక మార్పు తేవడానికి మనం దోహద పడడం వెనుక ఎలాంటి కారణం ఉండవలసిన అవసరం లేదనేది మా ఉద్దేశం. తోటివారి కష్టాలకు స్పందించి, వారికి సాయం చేసే సున్నితత్వం సమాజంలో పెరగాలి. ఆ దిశగా చైతన్యాన్ని వ్యాప్తి చెయ్యాలని, దీర్ఘకాలంలో... పేద వర్గాలను వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలని అనుకున్నాం. మురికివాడల్లో మా ప్రయత్నాన్ని ప్రారంభించాం" అని వివరించారు ఆ ఫ్రెండ్స్. కేవలం ఏదో ఒక అంశానికే పరిమితం కాకుండా... వైద్య శిబిరాల ఏర్పాటు, ఎడ్యుకేషన్ వర్క్‌షాపుల నిర్వహణ, శానిటరీ ప్యాడ్స్ ఆహారం, దుస్తులు, స్టేషనరీ, పుస్తకాల్లాంటివాటి పంపిణీతో సహా... విస్తృతమైన కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో...

"అవసరాలు తీర్చడం, ఆసరాగా నిలబడడం, విద్యకు, ఉపాధికి సహకారం అందించడం... ఇవీ మా ప్రాధాన్యాలు. అదే సమయంలో మౌలిక సదుపాయాలను, ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాం. విద్యుత్, పారిశుధ్య సదుపాయాలను అందుబాటులోకి తేవడం కూడా దీనిలో భాగం. మొత్తంగా వారి జీవన నాణ్యతను పెంచడానికి దోహదం చేస్తున్నాం" అని వారు చెబుతున్నారు. మురికివాడల్లో పిల్లలకు పాఠాలు చెప్పండం, ఆర్థిక విషయాలపై అవగాహన కల్పించడంతోపాటు ఢిల్లీలోని సిఆర్ఆర్ఐ మురికివాడలో కుట్లు, అల్లికలు లాంటి విషయాల్లో దాదాపు ముప్ఫై మంది మహిళలకు ఈ ఎన్జీవో శిక్షణనిచ్చి.. ఉత్పత్తులు తయారు చేయిస్తోంది. వాటిని మార్కెట్లలో, ఎగ్జిబిషన్లలో విక్రయించి... ఆ మహిళలకు శాశ్వతమైన ఉపాధి కలిగేలా చర్యలు తీసుకుంది. వీధి వర్తకులకు, చిన్న బండ్ల మీద సరుకులు అమ్ముకొనేవారికి ఎండ తీవ్రత నుంచి ఊరట కలిగించడానికి... కిందటి ఏడాది ఈ ఫ్రెండ్స్ ప్రారంభించిన 'బీట్ ది హీట్' కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. దాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. దీనిలో భాగంగా... పెద్ద గొడుగులు, టోపీలు, శీతల పానీయాలు, నీరు పంపిణీ చేస్తున్నారు. "వివిధ ప్రాంతాల్లో యాభైవేల మందికి వాటిని అందజేశాం. ఈ ఏడాది ఇప్పటికే అయిదు వేలమందికి పైగా ప్రయోజనం పొందారు. మరెంతో మందికి మా సేవలు అందించాల్సి ఉంది. దీనిలో ప్రజలను కూడా భాగస్వాముల్ని చేస్తున్నాం" అని చెబుతున్న 'వారియర్స్' ద్వారా గత మూడేళ్ళలో వివిధ సాయాలు అందుకున్నవారి సంఖ్య నాలుగు లక్షలకి పైనే.

ఈ పుట్టిన రోజు ఎంతో ప్రత్యేకం



వెండి తెరపై 'సమరసింహ'మైన బాలకృష్ణ విశ్వరూపం చూసి అభిమానులు ఏనాడో తరించి పోయారు. ఆ హోరులో బాక్సాఫీస్ వసూళ్ల పండగ చేసుకుంది. ఆ తాకిడికి రికార్డులు దాసోహం అయ్యాయి.. బాలయ్య చేతిలోని ఆయుధమే కాదు కంటి చూపు, మాట కూడా పదునే... అందుకే ఈ నట 'సింహా'నికి జనం నీరాజనాలు పట్టారు. రాజకీయాల్లోకి అడుగు పెడితే అక్కడ కూడా ఆయన్ని ఘనంగా ఆదరించారు. మూడో సారి కూడా ఆయన్ని శాసన సభ్యుడిగా గెలిపించి హ్యాట్రిక్ వీరునిగా నిలబెట్టారు. ఒక సినీ హీరో ఇలా వరుసగా మూడు సార్లు అసెంబ్లీకి ఎన్నిక కావడం చరిత్రలో ఇదే ప్రథమం. అంతకు ముందు ఎన్టీఆర్‌కు ఇటువంటి రికార్డ్ ఉన్నా ఆయన సినిమాల నుంచి రాజకీయ రంగంలోకి వెళ్లిన తర్వాత ఆ ఘనత సాధించారు. కానీ సినీ రంగంలో ఉంటూనే రాజకీయ రంగంలో కూడా రికార్డులు క్రియేట్ చేసిన ఏకైక హీరో బాలయ్యే. శాసన సభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించిన నేపథ్యంలో వస్తున్న పుట్టిన రోజు (జూన్ 10) కావడంతో ఈ రోజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది.

తండ్రి ఎన్టీఆర్ దర్శకత్వంలో 'తాతమ్మ కల' (1974) చిత్రంతో ప్రారంభమైన బాలకృష్ణ చలన చిత్ర యాత్ర ఇంకా నిర్విఘ్నంగా, నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది. ఆయనతో నటన ప్రారంభించిన హీరోలు, తర్వాత వచ్చిన వారూ మధ్య మధ్యలో గ్యాప్ తీసుకున్నా బాలయ్య మాత్రం ఆగిపోలేదు, అలసిపోలేదు. ఈ ఐదు దశాబ్దాల నట జీవితంలో భారీ విజయాలే కాదు..కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి.. అపజయానికి కుంగిపోలేదు. విజయానికి దగ్గర దారులు వెదుకుతూ రాజీ పడలేదు.

భారతీయ నట వారసుల్లో నందమూరి బాలకృష్ణ ప్రత్యేకత వేరు.. తన సమకాలిక హీరోలు సాంఘిక చిత్రాలకే పరిమితం కాగా పౌరాణిక, జానపద, చారిత్రక, సైన్స్ ఫిక్షన్ చిత్రాల్లో సైతం బాలకృష్ణ నటించి తండ్రి ఎన్టీఆర్‌కు తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నారు.



తెలుగు భాష పట్ల బాలకృష్ణకు ఎంతో గౌరవం. స్వచ్ఛమైన ఉచ్చారణతో, తెలుగుతనం ఉట్టిపడే పదాలతో ఆయన డైలాగులు చెప్పే తీరు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. అలాగే ఈ నందమూరి అందగాడు ముఖ కవళికల్లో, అనర్గళంగా సాగే మాటల్లో పౌరుషం శివమెత్తి నాట్యం చేస్తుంటుంది. అందుకే బాలయ్య డైలాగులు అంటే ఫ్యాన్స్ లో అంత క్రేజ్.. ఇక ఆయన కత్తి పట్టి రంగంలోకి దిగితే యాక్షన్ పంట పండినట్లే. తనకు ఉన్న ఇమేజ్‌కి భిన్నంగా నిజ జీవితంలో బాలకృష్ణ వ్యవహరిస్తుంటారు. నలుగురిలో మామూలుగా కనిపిస్తే హీరోగా తన ఇమేజ్ దెబ్బ తింటుందేమో అనే అభద్రత భావం బాలయ్యలో బొత్తిగా కనిపించదు. తన కారుని తనే డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళడం ఆయనకి ఒక సరదా. అలాగే అందరితో జోవియల్‌గా మాట్లాడుతుంటారు.

క్రమశిక్షణ.. ముక్కుసూటి మనస్తత్వం

బాలకృష్ణ తండ్రిలాగే క్రమశిక్షణకు ప్రాణం ఇస్తారు. అలాగే ఆయన నిర్మోహమాటి. ముక్కుసూటి మనస్తత్వం కలవారు. నాన్చుడు వ్యవహారం ఆయనకి నచ్చదు. ఏ విషయమైనా వెంటనే తేల్చేయాల్సిందే. నటన అనేది ఒక ఉద్యోగంగా భావించకుండా ఓ కళగా ఆరాధించే వ్యక్తి కావడం వల్లే ఐదు దశాబ్దాల నుంచి విరామం లేకుండా పనిచేస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తున్నారు.

రామోజీ సేవలు అజరామరం



అక్షర యోధుడు రామోజీరావు స్మృతికి నివాళిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమ ఆదివారం సంస్మరణ సభ నిర్వహించింది. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని రామోజీరావు సేవలు అజరామరమని కొనియాడారు. నిర్మాత కేఎస్ రామారావు, చదలవాడ శ్రీనివాసరావు, స్రవంతి రవికిషోర్, రచయిత పరుచూరి గోపాల కృష్ణ, విజయేంద్రప్రసాద్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్, సెక్రటరీ ప్రసన్నకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.